క్లుప్తంగా

ప్రవచనాలతో భక్తిభావం పెంపు



తిరుప్పావై ప్రవచన కర్త ఆచార్య రంగనాథ్‌ను సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మనుషుల్లో భక్తిభావాన్ని, మానవత్వాన్ని పెంచడానికి ప్రవచనాలు ఎంతో దోహద పడతాయని ప్రముఖ ప్రవచనకర్త ఆచార్య రంగనాథ్ తెలిపారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని అన్నమాచార్య కళామందిరంలో ప్రతి రోజు ఆచార్య రంగనాథ్ తిరుప్పావై ప్రవచనాలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆయన భగవంతున్ని భక్తులు చేరే విధానం గురించి వివరించారు. ప్రతి మనిషి సంపూర్ణంగా భగవంతుడిపై భక్తిభావాన్ని పెంచుకున్నప్పుడే అతనిలో మానవత్వం పరిమళిస్తుందన్నారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు ప్రవచనకర్త ఆచార్య రంగనాథ్‌ను శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు, కేఎన్ రాజా, ఈశ్వర్‌రెడ్డి ,హనుమంత రావు పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన ర్యాలీ



సీగొల్లపల్లిలో అవగాహన ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి రూరల్: రూరల్ మండలం సీగొల్లపల్లి పంచాయతీల్లో రీసర్వే ప్రాజెక్టుపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. త్వరలో ఈ గ్రామంలో భూముల రీ–సర్వే నిర్వహించనున్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి, అనంతరం రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విడుదల రవి, మండల సర్వేయర్ హేమకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఎస్వీసీసీ డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది జూన్‌లో నిర్వహించిన డిగ్రీ ఫస్ట్, సెకండ్ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతభ కనబరచి అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. కళాశాలలో మొత్తం 90 శాతం మంది విద్యార్థులు 8 నుంచి 9.5 పాయింట్లతో టాపర్స్‌గా నిలిచారని కొనియాడారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం, అధ్యాపకులు

తిరుపతి సిటీ: కోల్‌కత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ సంస్థ బుధవారం విడుదల చేసిని సీఎంఏ ఫౌండేషన్ కోర్సు ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. అందులో శ్రీకర్, నందిని, లతీఫ్, పూర్ణిమ, హరీష్, విఘ్నయ్, దీపిక 260 నుంచి 298 మార్కుల వరకు సాధించి టాపర్లుగా నిలిచారని సంస్థ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



చిత్ర పరిశ్రమ దర్శకుడు బెల్లంకొండ సురేష్

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం రేమాండ్స్ గ్రూప్ అధినేత గౌతమ్ సింఘానియా, తెలంగాణ మినిస్టర్ శ్రీధర్ బాబు, చిత్ర పరిశ్రమ దర్శకుడు బెల్లంకొండ సురేష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అన్నీ నంబర్లే.. కానీ కొన్ని మాత్రమే స్పెషల్.. నచ్చిన.. న్యూమరాలజీ ప్రకారం లక్కీ నంబర్ కోసం ఎంతైనా ఖర్చు చేస్తారు. 9999, 6666, 1111.. ఇలా తమకు నచ్చిన అదృష్ట సంఖ్యలతో కూడిన నంబరు కోసం రూ.లక్షలు చెల్లించి దక్కించుకుంటున్నారు. మరికొందరు వెరైటీగా నంబర్ ప్లేట్లను ముద్రించుకుంటున్నారు. గత కొంతకాలంగా వాహన రిజిస్ట్రేషన్లను ఆయా వాహన షోరూంల నిర్వాహకులే నిర్వహించేలా రవాణాశాఖ అప్పజెప్పింది. ప్రస్తుతం ఆయా వాహన షోరూంల ద్వారానే ఆన్‌లైన్‌లో బెడ్డింగ్ ద్వారా ఫ్యాన్సీ నంబర్లను వాహనదారులు పొందాల్సి వస్తోంది.

లక్కీ కిక్కు..



- వాహనాల రిజిస్ట్రేషన్‌లో ఫ్యాన్సీ నంబర్లకు ఆల్‌టైమ్ డిమాండ్
- ప్రతి సిరీస్‌లో అన్నీ 9 సిరీస్‌లో అ'ధర'హో
- ప్రత్యేక నంబర్లతో ఆర్టీఏకు ఏటా రూ.కోట్లల్లో ఆదాయం

తిరుపతి మంగళం: వాహనాల రిజిస్ట్రేషన్‌కు రవాణాశాఖ సంస్థ జారీ చేసే ప్రత్యేక నంబర్లపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటి నుంచి ఎంతో క్రేజ్ ఉంది. కారు, బైక్ వాహనం ఏదైనా సరే ×సమ్‌థింగ్ స్పెషల్‌₹గా ఉండాలని చాలామంది కోరుకుంటున్నారు. దీంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి రవాణాశాఖ విడుదల చేసే ప్రత్యేక నంబర్లు ప్రభుత్వానికి కాసులు కురిపిస్తున్నాయి. ఏటా రూ.కోట్లల్లో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి.

అదృష్ట సంఖ్య కోసం..

జ్యోతిష్యులు ఒక్కో నంబర్‌ను ఒక గ్రహంతో, వాటి కదలికలతో సరి చూసి భవిష్యత్‌ను, మానసిక స్వభావాలను అంచనా వేస్తారు. అలా తమ స్వభావానికి తగిన నంబర్‌ను వాహనదారులు ఎంపిక చేసుకుంటున్నారు. ఆ రకంగా 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9 వంటి ప్రతి సింగిల్ నంబర్‌కు ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. ఉదాహరణకు '1' నాయకత్వానికి, '2' శాంతస్వభావానికి నిదర్శనం. గురుగ్రహంతో పోల్చి '3' వల్ల చక్కటి తెలివి తేటలు, జ్ఞానం లభిస్తాయని నమ్మకం. '5'ను బుధుడికి ప్రతిబింబంగా భావిస్తారు. ఈ నంబర్ వల్ల వ్యాపారం బాగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకం. ఇక ప్రతి ఒక్కరూ ఇష్టపడే నంబర్ '9' కుజగ్రహానికి ప్రతీకగా భావిస్తారు.



లక్కీ నంబర్..

సంఖ్యాశాస్త్రం, జ్యోతిష్యులపై ఉండే విశ్వాసంతో కొంతమంది వాహనదారులు కొన్ని ప్రత్యేక నంబర్లపై ఆసక్తి కనబరుస్తున్నారు. రియల్‌ఎస్టేట్, వ్యాపారులు, సినీనటులు, రాజకీయ నాయకులతో పాటు సాఫ్ట్‌వేర్ సంస్థలు కూడా ఈ ప్రత్యేక నంబర్లపై ఎక్కువ మక్కువ చూపుతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసే లగ్జరీ వాహనాల కోసం నంబర్లు కూడా ప్రత్యేకంగా ఉండాలనే ఆకాంక్ష కూడా మరో కారణం.

అదృష్ట సంఖ్యలుగా భావించే నంబర్ల కోసం కొందరు పోటీకి దిగితే.. సామాజిక హోదా కోసం, పేరు ప్రతిష్ట కోసం మరికొందరు పోటీపడుతున్నారు. విభిన్న రంగాలకు చెందిన వాహన యజమానులు లక్కీ నంబర్ల కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆర్టీఐలో కొత్త సిరీస్ ప్రారంభమవుతుంది. మొత్తం నంబర్లలో 2500వరకు ఫ్యాన్సీ నంబర్లు ఉంటాయి. ఒక్కో నంబర్‌కు 5 నుంచి 10 మంది వాహన యజమానులు పోటీ పడడం విశేషం.

ఎప్పటి నుంచో క్రేజ్..

మొదట్లో ఈ నంబర్లకు పెద్దగా డిమాండ్ లేదు. ఇప్పుడు రూ.లక్షల్లో డిమాండ్ ఉన్న ×9999₹ రెండు దశాబ్దాల కిందట రూ.వేలల్లో లభించేది. 1990లో అయితే కేవలం రూ.500కు ఈ నంబర్‌ను కేటాయించేవారు. ఎన్టీ రామారావు రాజకీయ రంగ ప్రవేశంతో ఈ నంబర్‌కు క్రేజ్ వచ్చేసింది. అప్పట్లో ఎన్టీ రామారావు 27, 999, 9999 వంటి నంబర్లకు ప్రాధాన్యం ఇచ్చేవారు. దీంతో అందరూ ఇదే బాటలో నడిచారు. అప్పటి నుంచి బాగా డిమాండ్ పెరిగింది.

నంబర్లే బహుమతులు..

ఇటీవల కాలంలో చాలామంది వినియోగదారులు తమ కుటుంబ సభ్యులకు వాహనాలను బహుమానంగా ఇవ్వడమే కాదు. వారి పుట్టినరోజు కలిసొచ్చేలా రిజిస్ట్రేషన్ నంబర్లను ఎంపిక చేసుకుని పోటీకి వస్తున్నారు. 1313(తేరా తేరా) అంటే పంజాబీలకు ఎంతో ఇష్టం. దీనిని వాళ్లు అదృష్ట సంఖ్యగా భావిస్తారు. 5121 అనే నంబర్‌ను ఆంగ్ల అక్షరాల్లో సిరిగా భావిస్తారు. 143, 214, 9045 నంబర్లకూ ఎంతో క్రేజ్ ఉంది. జీవితంలో విజేతలుగా, తిరుగులేని నాయకులుగా ఎదగాలని కోరుకునే వాళ్లు.. పోటీమనస్తత్వం, పోరాడేతత్వం ఉన్న వారే ఈ ఫ్యాన్సీ నంబర్ల కోసం


నేడు సీపీఐ ధర్నా

తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం ఉదయం ఇంటిపట్టాలు కోసం ధర్నా నిర్వహిస్తున్నామని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణతో పాటు పలువురు నేతలు, ఇంటిపట్టాల కోసం అధికారులకు అర్జీలు అందించిన వారు హాజరు కానున్నారని ఆయన వెల్లడించారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు


తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో డిసెంబర్ 6 నుంచి నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. మండలంలో మొత్తం 29 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించామని, వివిధ సమస్యలపై 1188 అర్జీలు వచ్చినట్లు రూరల్ తహసీల్దార్ రామాంజనేయులునాయక్ తెలిపారు. ఈ సదస్సులో 4992 మంది పాల్గొన్నారన్నారు. వచ్చిన అర్జీల్లో అత్యధికంగా 397 మంది ఇంటి పట్టాల కోసం , 344 మంది 22ఏ జాబితాలో నుంచి తమ భూములకు విముక్తి కల్పించాలని, 243 మంది రికార్డు ఆఫ్ రికార్డ్స్ కావాలని, 132 మంది ఎఫ్–లైన్ దరఖాస్తులు ఇచ్చారన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 44 రాగా, మొత్తం 1,188 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తున్నామని, విచారించి పరిష్కరిస్తామన్నారు.

నేడు 'శేషాచలం కొండల్లో' ఆవిష్కరణ



తిరుపతి సిటీ : ఎస్వీయూ లైబ్రరీ సెమినార్ హాల్‌లో గురువారం ఉదయం శేషాచలం కొండల్లో పుస్తకాన్ని పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. బుధవారం ఈ మేరకు రచయిత, సీనియర్ జర్న లిస్ట్ రాఘవ మాట్లాడుతూ శేషాచలం అడవుల్లోని ప్రకృతి సోయగాలను పుస్తకంలో ఆవిష్కరించినట్లు వెల్లడించారు.

నిర్లక్ష్యం



రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు వంతెనపైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ మూడు, నాలుగు రోజులుగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

నేడు వర్సిటీలలో కార్యక్రమాలు

- ఎస్వీయూలో సీనియర్ జర్నలిస్ట్ రాఘవ రచించిన 'శేషాచలం కొండల్లో'పుస్తకావిష్కరణ
- పద్మావతి మహిళా వర్సిటీలో ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమానికి హాజరు కానున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో నాలుగో రోజు కొనసాగనున్న వెటర్నరీ అంతర్‌కళాశాల సౌత్‌జోన్ పోటీలు
- వైకుంఠ ఏకాదశి సందర్భంగా నేటి నుంచి టీటీడీ కళాశాల నుంచి శ్రీవారి సేవలో పాల్గొననున్న ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు
- నేటి నుంచి వేదిక్ వర్సిటీకి సంక్రాంతి సెలవులు

– తిరుపతి సిటీ

పరిశీలన

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలోని 3వ వార్డు పోస్టల్ కాలనీలో ప్రజల ఫిర్యాదులను బుధవారం కమిషనర్ మౌర్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా అధికారులతో కలసి ఆమె సమస్యలను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ మెరుగ్గా చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో ఎప్పటికప్పుడు మురుగు, చెత్త తొలగించి మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ రమణ, ఏసీపీ బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.



ప్రజాఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

బాలికల ఆరోగ్యం..భద్రత

పాకాల : స్థానిక వెలుగు కార్యాలయంలో కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కిరణ్మయి, కృష్ణవేణి నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ నంగా పద్మజా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు, నోడల్ టీచర్లకు, లెక్చరర్లకు, వెలుగు సిబ్బందికి, అంగన్‌వాడీ టీచర్లకు కిశోరి వికాసంపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాల్య వివాహాల నిరోధక చట్టం–2006 నిబంధనలు, కౌమార దశ, రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత, బాలల అక్రమ రవాణాలో స్వయం సహాయక బృందాలు, పంచాయతీ రాజ్ పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కిశోరి బాలలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సైబర్‌క్రైమ్ బారిన పడి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీరు సామాజిక రుగ్మతల నుంచి బయటపడే విధంగా అన్ని శాఖల అధికారులు కలసికట్టుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాబ్జీ, ఈఓపీఆర్డీ శశిరేఖ, డాక్టర్ అలెగ్జాండర్, ఏపీఎం రామ్మోహన్, అధ్యాపకురాలు పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శుభ్రత.. భద్రత ముఖ్యం

తిరుపతి రూరల్: యుక్త వయసులో ఉన్న బాలికలు శుభ్రత, భద్రత పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసీడీయస్ సీడీపీఓ ప్రదీప తెలిపారు. చంద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో రూరల్ మండల గ్రామ సచివాలయ వెల్ఫేర్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎం, నోడల్ టీచర్లు, వెలుగు సిబ్బందికి కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి రూరల్ ఎంపీపీ వేముల యశోద మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, ఏపీఎం నాగేశ్వర రావు, మెడికల్ ఆఫీసర్ సుకన్య, జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రావారిపాళెం మండలంలో..

భాకరాపేట: చంద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎర్రావారిపాళెం మండలంలో ఉన్న వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఏఎంఎస్‌లు, అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక శ్రీశక్తి కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ ప్రదీప మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు కిశోరి వికాసం చాలా అవసరం అన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోతి, తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఎంఈఓలు, ఏపీఎం, అధ్యాపకులు, టీచర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



తిరుపతి రూరల్ : మాట్లాడుతున్న సీడీపీఓ ప్రదీప



ఎర్రావారిపాళెంలో..

వివిధ శాస్త్రాల సమ్మేళనమే మహాభారతం

పాకాల : వివిధ శాస్త్రాల సమ్మేళనమే మహాభారతమని ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు ఆచార్య పీసీ వెంటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం, పలు సాహితీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మహాభారతం–విజ్ఞానం అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ధర్మశాస్త్రం, న్యాయశాస్త్రం, రాజనీతిశాస్త్రం, పరిపాలనా శాస్త్రం, ఖగోళశాస్త్రం, ఆయుర్వేదశాస్త్రం మొదలైనవి మహాభారతానికి నిలయమన్నారు. ముఖ్య అతిథి ఆచార్య రాజేశ్వరమ్మ మాట్లాడుతూ, భారతంలోని శాంతి పర్వం పలు ధర్మాలకు నిలయమని అన్నారు.సభా అధ్యక్షుడు డాక్టర్ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ, నేటి యువతరం మహాభారతాన్ని అధ్యయనం చేయాలన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ ఆర్‌బీ వాణిశ్రీ మహాభారతంలోని శ్రీకృష్ణుడు, కుంతి, గాంధారి, ద్రౌపది పాత్రల విశిష్టతను, అందులోని శాస్త్ర విషయాలను వివరించారు. సంచాలకులు డాక్టర్ ఈశ్వర్‌బాబు సదస్సు పత్రాల ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ముక్కంటి క్షేత్రంలో కూటమి వికృతాలు



కోనేరు చుట్టూ రాజకీయ పోస్టర్లు



భేరివారిమండపంపై వేసిన పోస్టర్లు

శ్రీకాళహస్తికి ఆధ్యాత్మిక శోభను దెబ్బతీసేలా చేసేలా కూటమి నేతలు రాజకీయ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కోనేరు చుట్టూ వాహనాలు నిలపకూడదని, దీనివల్ల ఆధ్యాత్మికత దెబ్బతింటుందని సోషల్ మీడియ ఉపన్యాసాలు దంచేస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వానికి సంబంధించిన రాజకీయ పోస్టర్లను అతికిస్తుంటే నోరు తెరిచి చూస్తుంటారు. సొంత పార్టీ అయితే న్యాయమా.. మరో పార్టీ అయితే అన్యాయమా అని ప్రజలు ప్రశిస్తున్నారు. కోనేరు చుట్టూ ఉన్న గోడపత్రికలను తొలగించి ఆధ్యాత్మిక భావన పెంపొందేలా చూడాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉంది. – శ్రీకాళహస్తి

స్విమ్స్‌లో దిద్దుబాటు చర్యలు

తిరుపతి తుడా: స్విమ్స్ సిబ్బంది వ్యవహార శైలితో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సాక్షి దినపత్రికలో ఆక్రోశం పేరుతో ప్రచురించిన శీర్షికపై అధికారులు స్పందించారు. ఈ మేరకు రోగులకు రిసెప్షన్, ఎంట్రన్స్ కౌంటర్ల వద్ద డేటా ఎంట్రీ ఆపరేటర్లను, బిల్లింగ్ సిబ్బందిని అప్రమత్తం చేసి రోగులకు త్వరితగతిన సేవలందించాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఆస్పత్రిలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రోగులతో బాధ్యతారహితంగా ప్రవర్తించిన సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేయడం జరిగిందని సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగుల పింఛన్లు తనిఖీ

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హత లేని దివ్యాంగ పింఛన్లను గుర్తించేందుకు వైద్య బృందం చేపడుతున్న తనిఖీలు చేపడుతున్న విషయం విదితమే. అందులో భాగంగా బుధవారం మండలంలోని ఇరంగారిపల్లి, కె.ఒడ్డేపల్లి, పాకాల, పంటపల్లి పంచాయతీల్లో నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించారు. మండలంలో మొత్తం 1,080 దివ్యాంగ పింఛన్లు ఉన్నాయి. మొదటి దశలో పక్షవాతం, మానసిక వ్యాధులతో మంచానికే పరిమితమైన 100 పింఛన్లను పరిశీలిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి మిగిలిన పింఛన్ దారులను తనిఖీ చేయనున్నారు. సదరం సర్టిఫికెట్లతో పాటు వ్యాధి తీవ్రత ఆధారంగా దివ్యాంగ పింఛన్లు పొందేందుకు అర్హత ఉందా ? లేదా ? అనే కోణంలో వైద్యులు క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగుడి పరిస్థితిని పరిశీలిస్తున్న వైద్యులు